# మహాప్రస్థానం

—కొండి వెంకటరత్నం



వాళ్ళిద్దరి మధ్య నిశ్శబ్దం, వక్రంగా నిలబడింది. అంతకుముందే ఆ గదిలో జరిగిన సంఘటన అలాంటిది:-

పనిమనిషి అచ్చమ్మ. కాండ్రించి కిటికీలోంచి బయటకు ఉమ్మింది. పైటచెంగుతో పెదాలను గట్టిగా తుడుచుకొంది. నల్లటి కళ్ళతో ఎఱ్ఱగా అతని ముఖంలోకి చూసింది. ఆమె పెదవుల్లో- ఆమె ముఖంలో, ఆమె గుండెల్లో అనిమిష మహా సముద్రమంత కోపం, అసహ్యం.

అతను పేడకి మాత్రం హాసు మంతరాపు. ఇప్పుడు-ఆమె క్రోధాన్ని ఎదుర్కొగల గుండెబలం అతనిలో అణుమాత్రం లేదు! నిస్సహాయంగా నిలబడి వెఱ్ఱివాడిలా ఆమెవెంపు చూస్తున్నాడు. ఇప్పుడు-ఆమె ఏం చేస్తుందోనన్న భయం తప్ప, అతనిలో, ఆమె శరీరపు ఒంపులమీదగాని, యౌవనం మీదగాని ఏమాత్రం కోరిక లేదు.

నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ అచ్చమ్మ అంది- "ఓహో.... అబ్బాయిగోరే! షారం మా జోరుగుంది! నేనుగానీ మల్లి తోటలో మడిసిననుకున్నావా? ఇలాటెవ్వారాలు నాకాడ పన్జెయ్యవు జాగ్రత్త కూడరేకపోతే పోమె-నీతి లేన్దాన్ననుకున్నావా? మా యాయన్తో గాన్జెప్పానా నీ జలుబొదిలిపోద్ది. అంత కండకావరంగుంటే ఆ మల్లితోట్లోకే

పోలేకపోయావ్ అద్దరూపాయ్ పారేస్తే అడ్డదారుకుద్ది? ఏపంయ్యో ఇయ్యాళ్ల చెప్తన్నాయిను- ఇలాచేశాలు మల్లా యేసావో నేన్నీకాడ పన్జెయ్యడానికి సత్తేరాను."

ఆమె కోపాన్ని అతను వినలేకపోయాడు.

ఆమె విసవిసా వెళ్ళిపోయింది.

కదలకుండా అతను అలాగే నిలబడిపోయాడు. అతనికళ్ళు ఆమె వెళ్ళినవెంపే ఉన్నాయి: పెదాలు లోలోపల ఏదో మాట్లాడుకొంటున్నాయి.

ఆ గదిలో చీకటిలాంటి నిశ్శబ్దం వ్యాపించింది.

చాలాసేపు అక్కడే నిలబడిన హనుమంతరావు గుండెలు ఒణకసాగాయి. పేలవంగా చూస్తున్న అతని కళ్ళనిండా నీళ్లునిండాయి. కణతలు గట్టిగా నొక్కుకున్నాడు. జుత్తు పీక్కున్నాడు. చాపమీద బోర్లాపడిపోయాడు. అతని వీపు ఎగిరెగిరి పడుతూంది,

• • •

కొంతసేపటికి అతని గుండెల బరువు కొంత తగ్గింది. చాపమీద చేతులానుకుంటూ లేచి కూర్చున్నాడు. నిర్లిప్తంగా అతని చేతులు, రేకుపెట్టెమీద ఉన్న అద్దాన్ని తీసుకున్నాయి.

అద్దంలో అతని ముఖం అతనికి కనిపిస్తోంది, సంధ్య-చీకట్లలో. కన్నీటి చారికలతో భయంకరంగా వుంది, అసహ్యంగావుంది.

'నీ తప్పులేదు అచ్చమ్మా-నిన్ను కోరడం నాదే తప్పు. నీ అందాన్ని నాకెందుకిస్తావు? అందమైన నీమొగుడికిస్తావు-లేకుంటే మరొకడికి? నాకెలా యిస్తావు?' అనుకున్నాడు. వెక్కిరిస్తూన్న అద్దాన్ని పెట్టిమీద ఉంచేశాడు.

'నువ్వు సాధారణమైన పనిమనిషివి. అంట్లుతోముకుని బతుకుతున్నావు. ఐనా అందంగా ఉన్నావు. కనీసం నీ అందానికికూడా నేను సరిపోలేదు.'

"నీ తప్పులేదు-అచ్చమ్మా, నువ్వు నీతిగలదానివి!"

హనుమంతరావు మెదడులో ఆవేదనను కలిగించే ఆలోచనలు! అనంతమైన ఆలోచనలు?

తను చాలా అనాకారి అని అతనికి తెలుసు. కనుకనే, అందంగా కనబడాలని అతని తాపత్రయం.

సాధారణంగా నల్లకళ్ళజోడుని అతనెప్పుడూ వదిలిపెట్టకపోయినా అతనికి ఒక కన్ను కనిపించదని చాలామందికి తెలుసు. ముఖంనిండా చిన్న చిన్న గుంటలు? లావుగా, పొడవుగా వున్న ముక్కు. ఎంత సంరక్షణ చేసినా రేగిపోయి ముఖంమీద పడుతున్న జుత్తు, సన్నటి, నల్లటి శరీరం-ఇవన్నీ

కూడబలుక్కుని, పాపం, అతన్ని అనాకారిగా నిరూపించాయి.

గదిలో చీకటి వికృతంగా నవ్వుతోంది. హనుమంతరావు పచార్లు చేస్తున్నాడు. లైటు వెలిగించుకోవాలని అతనికి ధ్యాసలేదు. వెలిగించుకోనే శక్తీ లేదు, విరామరహితంగా తిరుగుతున్నాడు. బరువు బరువుగా అడుగులు వేస్తున్నాడు.

తన అందవిహీనతకి మూలం ఎక్కడో తనకే తెలియని హనుమంతరావు మీద—అ చిన్న గ్లగానీ, గదిలో తగిలి వ్రేలాడుతూ మెరుస్తున్న నాలుగు జతల టెర్లిన్ బట్టలుగానీ, షెల్ఫులో నిలబడిన అలంకార సామగ్రులు గానీ, గోడమూల వరుసగా విశ్రాంతి తీసుకుంటున్న మూడుజతల పాదరక్షలుగాని సానుభూతి చూపించడంలేదు. "నీ వికారానికి కారణమేమిటి హనుమంతరావ్?" అని మృదువుగా ప్రశ్నించడంలేదు. 'మా శక్తినంతా వినియోగించి నిన్ను ఆకర్షణీయంగా చెయ్యాలని ప్రయత్నిస్తున్నాం. ఐనా మమ్మల్ని లోలోపల నిందించుకుంటావు. ఎలాగ చెప్పు?' అని నిష్ఠూరంగా అడుగుతున్నాయి:

హనుమంతరావు నడుస్తున్నాడు. ఆ గదిలోనే-దరిదాపు వంద కిలోమీటర్ల దూరం నడిచిఉంటాడు.

ఇంకా నడుస్తున్నాడు. ఆగుతూ నడుస్తున్నాడు. ఆలోచనలతో నడుస్తున్నాడు. నిస్సత్తువగా నడుస్తున్నాడు.

అతని మనస్సులో బాధ, ఇతరులతో చెప్పుకోలేని బాధ,

ఇక నడవలేకపోయాడు. సోఫామీద చతికిలబడ్డాడు.

ఆ గదికి కిటికీవుంది. కాని గాలి రావటంలేదు, అతని హృదయం ఉక్కపోతోంది.

నిట్టూరుస్తూ రేకుపెట్టె తెరిచాడు. అట్టడుగున దాచుకున్న డైరీ బయటకు తీశాడు.

విధిగా లేచి, లైటు వెలిగించి మళ్ళీ కూర్చున్నాడు. అణగిపోయిన మన

---

'మీ రెవరండీ?' అని అడిగాడు పిచ్చాసుపత్రిలో ఒక పేషెంటు.

''నేను కొత్తగావచ్చిన సూపర్నెంటును. అని సమాధానం.

'బాగుంది మంచిపేరు. నేనూ ఇక్కడికి వచ్చినప్పుడు నాపేరూ ఎంతో బాగుండేది.'

'ఏమిటది ?'

'సముద్రగుప్తుడు'

న్నులా ఎలక్ట్రిక్‌దీపం వెలుగుతోంది.

ఒక్కొక్క పేజీ తిప్పుతూ డైరీలో తెల్లకాయితాల దగ్గర ఆగిపోయాడు హనుమంతరావు. చేతిలోకి కలం తీసుకున్నాడు....

"కొందరికి అదృష్టం, మరికొందరికి దురదృష్టం. కొందరికి ఆనందం, మరికొందరికి విషాదం. కొందరిలో అందం, మరికొందరిలో....!

"ప్రపంచంతో ఇన్ని కోట్లమంది స్త్రీలున్నారుకదా, ఒక్కరూ నన్ను ప్రేమించరేం? ఒక్కరూ నాకోసం తపించరేం? నన్ను చూడగానే వాళ్ళ గుండెలు అసహ్యంతో ముడుచుకుంటాయి!

"ఛీ.... వెధవ జీవితం. అసంతృప్తి తప్ప మరేదీ కనిపించడంలేదు.

'ఎలుకతోలు ఉతకాలనుకోవడం పొరపాటే. ఛ— ఇక ఈ జీవితం ఇంతే కాబోలు."

బలవంతంగా ఒక్కసారి ముద్దు పెట్టుకొన్నందుకు అచ్చమ్మ అరవైసార్లు తిట్టుకుంది. ముఖంమీదే చీదరించుకుంది. దాని కళ్ళలోకి చూశాక అంతకుముందే దాని మనస్సులో దాక్కిన అసహ్యకం చచ్చిపోయింది.


'ఇక ఈ జీవితంలో నన్ను ప్రేమించేవాళ్ళులేరు. ఇక నాకు ఆనందం లేదు."

రెండు కన్నీటిబొట్లు కాయితంమీద పడి చెదిరిపోయాయి. మొనదేరనపళ్ళ చక్రాల్లాగ ఆ కన్నీటిబొట్ల గుర్తులు కనిపిస్తున్నాయి.

డైరీ రాయడం ఆపుచేశాడు గుండెలు బరువుగా రాసుకున్నాడు. అతని కనుబొమ్మలు బాధగా ముడిపడ్డాయి.

'ప్రేమ!....లోకంనిండా తియ్యటి ప్రేమ కనిపిస్తుంది. కాకి, తన జతగాడైన కాకిని ప్రేమిస్తోంది, సున్నితమైన లత. ముళ్ళచెట్టును ప్రేమించగలుగుతోంది, ప్రపంచమంతా






ప్రేమతో నిండిపోయింది. నాకు?.... అదే ప్రేమ కరువైంది."

మరొకసారి గుండెలు నొక్కుకున్నాడు. ఆలోచనల పట్టుకారు అతని మస్తిష్కాన్ని నొక్కుతోంది.

అతని మనస్సులో. అవతలివీధిలో తాలూకు ఇంట్లో ఉంటున్న పద్దెనిమిదేళ్ళ అమ్మాయి నిలబడింది.

"కనీసం ఆ అమ్మాయి నన్ను ప్రేమించకూడదూ? హుం ...నా పిచ్చి కాకపోతే ఆమె నన్నెందుకు ప్రేమిస్తుంది? రోజూ సాయంత్రం ఎవరో అదృష్టవంతుడకోసం ఎదురుచూస్తూ వుంటుంది. ఆమెకళ్ళలో ఎంత అందమైన కాంతి!...."

హనుమంతరావు డైరీ పేజీలు నింపుతున్నాడు. మధ్యమధ్య బాధతో కళ్లుమూసుకుంటున్నాడు.

నడుస్తున్నకాలం అతనికి తెలియడంలేదు.

• • •

హనుమంతరావు, పెట్టెలోంచి ఒక పెద్ద కాయితాలకట్ట బయటకు తీశాడు. అందులోంచి ఒక్కొక్క కాయితమే తీస్తున్నాడు. తీసి చూస్తున్నాడు. చూసి. వెంటనే పెట్టెమీద పడేస్తున్నాడు. అప్పుడప్పుడు డైరీలో ఏదో రాస్తూనే ఉన్నాడు. చూసిన

కాయితాలే మళ్ళీ మళ్ళీ చూస్తున్నాడు.

అవన్నీ అతను ఎవరెవరికో రాసిన ప్రేమలేఖలు! కాని వాటినెవ్వరూ అందుకోలేదు! అసలు ఆ ఉత్తరాలెప్పుడూ ఆ గదిదాటి బయటకు వెళ్ళలేదు!

హనుమంతరావు గుండెలు కలుక్కుమన్నాయి. కొద్దిసేపు భారంగా కూర్చున్నాడు. అతని మనస్సంతా చికాకుగావుంది.

"గుండెల్లో ఎందుకో నెప్పిగా వుంది. జీవితంమీద విరక్తికలుగుతోంది. నా అనేవాళ్లు ఎవ్వరూ లేని నాకెందుకీ బ్రతుకు."-డైరీలో రాసుకున్నాడు.

ఆలోచనలు అతని మనస్సుని జలగల్లా పీలుస్తున్నాయి. భోజనం చెయ్యాలని అనిపించలేదు. నిద్రకోసం అతను ప్రయత్నించలేదు. పచార్లు చేస్తున్నాడు. కన్నీరు కారుస్తున్నాడు. కన్నీటిమధ్య, ఎందుకో నవ్వుతున్నాడు. ఆ వేశంతో అతనిగుండెలు కదులుతున్నాయి.

రోడ్డు రోలరు లాంటి కాలం అతని హృదయంమీంచి గంటసేపు నడిచింది.

అతని కాళ్ళు అప్రయత్నంగా ఆగిపోయాయి.

డైరీ చేతిలోకి తీసుకున్నాడు. క్షణంలో దాని పేజీలన్నీ చింపి పోగుపోశాడు. అగ్గిపుల్ల వెలిగించాడు. వాటికి అంటించాడు- మంట రగులుకుంది. మంట రానురాను పెద్దదవుతోంది.

ఇప్పుడు అతని కళ్ళలో ఒకవిధమైన తృప్తి కనిపిస్తోంది. తనురాసిన ప్రేమ లేఖలు ఒక్కొక్కటీ తీసి ఆ మంటలో వేస్తున్నాడు.

ఆ మంటలే- విచిత్రమైన అతని ఆవేదనకు శాంతి నిస్తున్నాయి!

కొద్దిసేపటికి మంటలు ఆరిపోయాయి. అతను తేలిగ్గా శ్వాసవదిలాడు.

అప్రయత్నంగా అతని దృష్టిఅద్దం మీద పడింది. కసిగా ఆ అద్దాన్ని గోడ మూలకు విసిరాడు. ఫళ్లున అద్దం బ్రద్దలౌతుండగా అతను పకపకా నవ్వాడు. "ఈసారి నారూపాన్ని ఎవరు గుర్తుచేస్తారో చూస్తాను.' అనుకుంటూ మళ్ళీ నవ్వాడు, ఆనందంగా నవ్వాడు. పూలరేకులా అతని హృదయం తేలికబడింది. నవ్వుతూ నవ్వుతూ హటాత్తుగా ఆగిపోయాడు, గుండెలు చేత్తో రాసుకున్నాడు.

ఎక్కడో తొలికోడి కూసింది.

## 2

రోజూలాగే తెల్లవారింది. ఏడు గంటలైంది.

గత సాయంత్రం ఏ సంఘటనా జరగనట్టుగానే అచ్చమ్మ, దోరనేరేడు పండులా మెరుస్తూ హనుమంతరావు

గదితలుపు తట్టింది. రోజూ! పాపు గంటసేపు తలుపు బాదితేగాని అతను లేవడు. కాని ఈ రోజున తెరిచే వుంది!

"ఇయ్యాళ బేగానే లెగిసిపోనాదే బాబు!" అనుకుంటూ అచ్చమ్మ లోపల ప్రవేశించింది.

హనుమంతరావు ఇంకా చాపమీద పడుకునే ఉన్నాడు.

"ఓరి బాబూ! రాజాగారులాగా తలుపు తీసే తొంగున్నాడల్లా!" అనుకుంటూ అతన్ని లేపడానికి వెళ్ళింది.

"బాబూ.... అబ్బాయిగోరూ." పిలిచింది. అతను పలకలేదు.

మళ్ళీ పిలిచింది.

గట్టిగా పిలిచింది.

మళ్ళీ మళ్ళీ పిలిచింది.

అతను లేవలేదు.

అచ్చమ్మకు విసుగెత్తి - అతని ముఖంమీదికి ఒంగి-గట్టిగా అరచింది. "ఓయబ్బాయిగోరూ.... లెగండీ." అని అప్పుడు అతని ముఖంలోకిచూసింది. అతని కనురెప్పలు తెరుచుకుని భయంకరంగా కనిపిస్తున్నాయి. వాటిలో కదలిక లేదు. ఆమెకు అనుమానం కలిగింది. అతని శరీరం తాకిచూసింది.

అంతే - ఆమెగుండె గతుక్కుమంది. అక్కడ నిలబడలేకపోయింది. ఒణుకుతున్న శరీరంతో వీధి లోకి పరిగెత్తింది.

చుట్టుపట్లఉన్న గుమ్మాలు ఎక్కుతోంది, దిగుతోంది. తన అనుమానాన్ని తడబడుతూ చెబుతోంది.... చేతులూ, కళ్లూ ఆడిస్తూ, గుండెలు బాదుకుంటూ, 'ఓయి నాయినోయ్.... అమ్మోయ్....' అంటూ,

అచ్చమ్మ ప్రభావంవల్ల ఒక్కొక్కరే హనుమంతరావుగది ముందు గుమిగూడుతున్నారు.

అప్పుడే పక్కింటి అరవైయేళ్ల తాతగారు నిర్ధారణ చేశారు ఇక హనుమంతరావు జీవితయాత్ర ముగిసిందని.

అందరూ ఆశ్చర్యపడ్డారు.

"అరె! హనుమంతరావు చచ్చిపోయాడా!" ప్రతీనోరూ యిదే మాట!

విలవిలలాడుతూ చాలా మంది చేరారు. హనుమంతరావు గదిముందు కోలాహలంగా వుంది.

"ఇతని తాలూకు బంధువులెవరూ లేనట్టున్నారు.'' అన్నారెవరో.


---

"ఈ రహదారి మీద బోర్డుఉండే 'ఆగండి. చూడండి. వినండి.'' అని - అది ఎంతోగొప్పది' అన్నాడొక ప్రేమారావు సాలోచనగా.

"ఏం?"

''సువ్వొక అందమైన పిల్లనుచూస్తావు. ఆగుతావు. పెళ్ళి అయిన తర్వాత మిగిలిన జీవితమంతా వింటూ గడుపుతావు.''

ఫోస్ఫోమిన్



శక్తిని పెంపొందించును.

ఆకలిని అధికము చేయును.






సహనశక్తిని

హెచ్చించును.

శరీరముయొక్క రోగనిరోధక శక్తిని

ఎక్కువ చేయును.




అవును — కుటుంబమంతా
అందరికి ఫోస్ఫోమిన్
వల్ల ... చేయును.

... టానిక్

® ఇ. ఆర్. స్క్విబ్ & సన్స్ ఇన్‌కార్పొరేటెడ్ వారి
రిజిస్టర్డ్ ట్రేడ్ మార్కుకు చిహ్నం: దీని లైసెన్సు
ఉపయోగదారులు కరంచంద్ ప్రేమచంద్ ప్రయివేట్ లిమిటెడ్

SQUIBB®

SARABHAI CHEMICALS

Shilpi SC 50 A/67 Tel

'అవును. ఇతని గదికి ఎవ్వరూ వచ్చినట్టూ లేదు.' మరొకరు.

"యువకుడు! ఇంత హటాత్తుగా చచ్చిపోతాడని తెలిస్తే కావలసినవాళ్లెవరైనా ఉన్నారో లేదో ముందే తెలుసుకుందుము."

"అంతేనండీ - చావు ఎప్పుడొస్తుందో ఎవరికి తెలుసుగనక!'

"నిన్న సాయంత్రం నిక్షేపంలా ఉన్నాడు గదండీ? ఐదుగంటలకి గది తలుపులు తీస్తుంటే చూశాను కూడా."

'అతని గదిలోంచి అచ్చమ్మ వెళ్లడం కూడా చూశాను నేను.'

"గదిలో లైటు చాలాసేపు వెలిగిందండి.'

'ఏమిటో పాపం - ఉత్తనే ఎగిరిపోయాడు.'

"ఏమండీ తాతగారూ-ఇంతకీ అతగాడు చనిపోవడం నిర్ధారణేనంటారా? ఏ 'సరుకే'నా మింగించి నిద్రపోయున్నాడంటారా?" అంటూ ఓ గొంతు సందేహం వెలిబుచ్చింది.

"ఉండవయ్యా నువ్వా నీ వేళాకోళాలూను. హాస్యానికి సమయం లేదూ?"

"హాస్యం కాదయ్యా స్వామీ. అతను "సరుకు" పుచ్చుకుంటుండగా ఓ రోజున చూశాను. నాకు ఇవ్వాల్సిన డబ్బు అడుగుదామని వెళ్ళాను? మంచి నిషాలో వున్నాడు. తిరిగి వచ్చేశాను. పైగా ఓసారి ఇలాగే ఓ చిత్రం జరిగింది ..." సందేహపు కంఠం సమర్థించుకుంటూంది.

ఒక్కొక్కరే హనుమంతరావు గదిలోకి వెళ్ళి చూసివస్తున్నారు. లోలోపలి భయంవల్ల హనుమంతరావు ముఖంలోకి చూడలేకపోతున్న వాళ్లు గదిచుట్టూ చూస్తున్నారు. ఆ గదిలో టెర్లిన్ బట్టలు, ఖరీదైన చెప్పుల జోళ్ళు, ఖాళీగా మూత తెరచివున్న తుప్పురేకుపెట్టె. చిరిగిపోయిన రెండు లుంగీలు, మాసిపోయిన బనీను. చిందరవందరగా పడివున్న పుస్తకాలు, షెల్ఫులో అలంకార సామాగ్రులు, పగిలిపోయిన అద్దంపెంకులు' కాలిపోయిన కాయితాల తాలూకు మసి - వీటిని తప్ప, వట్టిచాపమీద నిశ్చలంగా వున్న హనుమంతరావు శరీరాన్ని ఎవరూ పరిశీలనగా చూడలేకపోతున్నారు. ఆ గదిలోంచి వాళ్ళేమీ చదవలేకపోతున్నారు.

అతనికి కావలసిన వాళ్ళ చిరునామాలు ఏమూలనైనా దొరుకుతాయేమోనని ఒకాయన గది అంతా వెతుకుతున్నాడు. ఎవరికి తోచింది వాళ్ళు మాట్లాడుతున్నారు. గదిలోకి వచ్చిన వాళ్ళు బయటకు వెడుతున్నారు. బయటకు వెళ్ళినవాళ్లు గదిలోకి వస్తున్నారు. కొందరు, 'చొ, చొ,' అంటున్నారు. కొందరు, 'పాపం,' అంటున్నారు.

గదిలో వెతుకుతున్న పెద్దమనిషికి —రెండు మూడు డిటెక్టివ్ పుస్తకాలు, ఏవో పత్రికలు తప్ప పనికి వచ్చేది ఏదీ దొరకలేదు. ఐనా ఆయన వెతకడం మానలేదు. రేకుపెట్టె వెన

కాల ఒక చిన్న ఉత్తరం చివరికి ఆయనకు దొరికింది. దాన్ని విప్పాడు. "చదువుతాను వింటారా?" అడిగాడు. గదిలో కలకలం ఆగిపోయింది. చదవసాగాడు.

"ప్రియమైన శారదకి—

నువ్వు నన్ను ప్రేమించానని చెప్పావు. నాకు నిజంగా స్వర్గం లభించినంత ఆనందం కలిగింది. కొన్నాళ్లు నాతో స్నేహంగా వున్నావు. నీ మనస్సెంతలో ఎలా మారిపోయింది శారదా? నాకు దూరమై పోయావు. నన్ను చీదరించుకున్నావు. ఆ చిన్నారావు వెధవ నాకంటే అందంగా వున్నాడా?

శారదా—నువ్వు లేకపోతే నేను బ్రతకడం అనవసరం. మరచిపోకు. జవాబు కావాలి నాకు. వారం రోజుల్లో జవాబు రాకపోతే నా శరీరం మాత్రం మిగులుతుంది. ఆతరువాత ఎంత విచారించినా లాభం వుండదు."

"ఈ ఉత్తరం అతను రాసిందే. క్రిందన సంతకం కూడా చేశాడు. ఇందులో ఈ శారద చిరునామా ఎక్కడా లేదు. ఇప్పుడేం చేద్దాం? ఉత్తరం మడుస్తూ అడిగాడాయన.

"ఏమండీ, ఒకవేళ ఈ శారద మోసం చేసింది గదాని అతను ఏ నిద్రమాత్రలైనా అతిగా మింగలేదు గదా?" సందేహాల_రావు గొంతు.

"ఏమో మరి."

ఎలా తెలిసిందో తెలియదు— ఆ యింటి యజమాని పాపారావు గారు ఆదరాబాదరా పరుగెత్తుకొచ్చారు గదిలోకి. అక్కడున్న అందర్నీ చూశారు. హనుమంతరావు శరీరాన్ని చూశారు. ఆయననోట మాట రాలేదు. 'అయ్యయ్యయ్యో— గదిలోనే చచ్చిపోయాడే, ఇంక రేపటినుంచి ఈ గదిలోకి అద్దెకెవరొస్తారురా దేవుడా?... మూడు నెలల అద్దెకూడా బాకీపడి చచ్చిపోయాడు. ఈవేళ ముక్కుపిండి వసూలు చేద్దామనుకుంటూండగానే వెళ్లిపోయాడు. ఈవేళఖాళీచేయిద్దామనుకుంటుండగానే చచ్చిపోయాడు?' ఇలాగ విచారిస్తూ పాలిపోయిన ముఖంతో నిలబడిపోయారు పాపారావుగారు.

హనుమంతరావు మరణం పాపారావు గార్ని అంతగా కృంగదీసుందని ఎవరూ ముందుగా అనుకోలేదు. తలోకరూ తలోరీతిగా పాపారావు గార్ని పరామర్శించడం మొదలు పెట్టారు. ఆయన, మతిపోయినవాడిలా చూస్తున్నారు.

వీధిలో....

నాలుగు వీధులనుంచీ జనం పోగయ్యారు. కొందరు వస్తున్నారు. కొందరు వెడుతున్నారు. గుంపుమాత్రం తరగలేదు. గుంపు మధ్య గుసగుసలు, సందేహాలు.

"హనుమంతరావు చచ్చిపోయాడంటే నేను నమ్మలేదు సుమండి, నాదగ్గర పుచ్చుకున్న పాతికరూపాయలూ 'ఇచ్చేసి మరీ చచ్చిపోతాన'ని వారంరోజుల క్రింతం వాగ్దానం చేశాడు."

"మీకూ అతను బాకీ ఉన్నాడూ! నాకూ ఇవ్వాలండీ ముప్ఫై రూపాయలు."

"అతను చాలామందికి బాకీపడ్డాడనుకుంటాను. నేనూ అతనికి రెండు మూడు దఫాలు ఇరవై రూపాయలిచ్చాను. అతని నవ్వుముఖం, అతని మంచితనం చూస్తే ఇవ్వకుండా ఎలా ఉండగలం చెప్పండి? ఏంచేస్తాం - ఇంక ఆ డబ్బుకి నీళ్లే."

"ఏమండీ, ఒకవేళ అతను ఆ డబ్బు!...."

"ఉండవయ్యా నీ సందేహాలూ నువ్వూను."

"అదికాదయ్యా, అతనికి అప్పులెక్కువున్నాయంటున్నారు కదా - అవి తీర్చలేక ఏ ఎలికల మందైనా పుచ్చుకున్నాడేమోనని నా సందేహం."

"అవునండీ పాపం.... అదికూడా ఆలోచించవలసిన విషయమే మరి."

"ఆ(.... వెధవది. బాకీలు తీర్చలేకపోతే చచ్చిపోతాట్టండీ ఎవడేనా?"

"అలా కొట్టిపారెయ్యకండి. మా వూర్లో ఇలాగే ఒకసారి...."

అతను చెబుతున్నది ఎవరూ వినిపించుకోలేదు.

మరొకవైపు....

"ఎంత మంచితనం! ఎంత వినయం! ఇంత హటాత్తుగా పోయాడంటే నాకు చాలా ఆశ్చర్యంగా వుంది. ఎప్పుడూ నవ్వుతూనే ఉండేవాడు గదా."

"ఏం ఉద్యోగం చేస్తున్నాడో ఏమోగాని అప్పులు మాత్రం చాలా ఉన్నాయట!"

'ఉండవుటండీ మరి! అతని బట్టలు, అతని వేషం చూశారా? ఏ జమీందారో, ఎం ఎల్.ఎ.గారో వేసుకోవలసిన వేషం. వాటికి డబ్బెలా వస్తుంది మరి?"

"మా అబ్బాయిలకి ట్యూషన్ చెబుతానన్నాడు. అలాగే రమ్మన్నాను. రెండోరోజునుంచీ- 'ఆయన దగ్గర చదువుకోం మొర్రో' అని మాపిల్లలు ఒహటేగోల. పాపం. ఎందుకుపోయాడో ఏమో...."

అక్కడ జేరినవాళ్ళకి వాక్స్వాతంత్ర్యాన్ని భగవంతుడే ఇచ్చాడు. వాళ్ళకి సమయం, సందర్భంతో పనిలేదు.

ఆత్మీయులెవ్వరూ లేవుగనక హనుమంతరావు శవంమీద కన్నీళ్ళు వర్షించలేదు.

అతనికి ఈ లోకంతో పని తీరిపోయింది. ఇకమీదట అతనికి-అందంగా కనిపించాలనిగాని, చేసిన అప్పులు తీర్చాలనిగాని, పెదాలను బలవంతంగా నవ్వించాలనిగాని తాపత్రయం లేదు. ఎవరు తిట్టినా. ఎవరు పొగిడినా, ఎవరు ఆనందించినా, ఎవరు అసహ్యించుకున్నా అతనికి చింతలేదు.

ఎదురింటి అరుగుమీద చాలా సేపటినుంచి నిలుచునివుంది అలసిపోయిన అచ్చమ్మ. గతసాయంత్రం హనుమంతరావు ప్రవర్తన గురించి తన మొగుడికి రిపోర్టు చెయ్యాల్సిన అవసరం

తిరిపోయింది. ఆమె ఏదో ఆలోచిస్తూ అతని గదివైపు చూస్తోంది.

"పాపం, ఇట్టే సచ్చిపోయాడు. నిన్నస్తాపేలి సూసినాయన ఇయ్యాల లేడు!—పేగులాగ! ఆయనకెంత బల వుంది! ఇరిపించుకునేప్పటికి తాతలిదిగొచ్చారు. ఏటో, ఎర్రిమడిసి. నేసంటే పేనంగావాలు, నేనంతందంగున్నానా?....పాపం, పేన్నిలోకాను మొకం మీద. పాతిక రూపాయిలిమ్మంటే ఇచ్చేసునేమో...." ఇలా ఆలోచిస్తూ నిలబడింది ఆమె.

'ఏ మందోతిని బలవంతం సావు సచ్చేడంట. జెమతో సచ్చిపోయాడు. ఒకేల దెయ్యమై నన్ను పీకుతాడో యేటో....'

ఈ ఆలోచన వచ్చేసరికి అచ్చమ్మ భయంతో ఒణికిపోయింది. స్తంభాన్ని గట్టిగా పట్టుకుంది.

ఒక్కొక్కళ్ళే జనం జారుకుంటున్నారు ఎటుపోయి ఎటువస్తుందోనని వాళ్ళభయం. బాధల్ని దూరంనుంచిచూసి ఆనందిస్తుందిగాని, దగ్గరకువెళ్ళి సహాయం చెయ్యడానికి ఒప్పుకోదు మానవ నైజం.

గదిలో....

పాపారావుగారిచుట్టూ కొందరుమిగిలారు. హనుమంతరావుకి కావలసిన వ్యక్తి పాపారావుగారొక్కరే అని నిర్ధారణ చేశారు వాళ్ళు.

'అయ్యా, పాపారావుగారూ. ఇప్పుడేవిఁటి కర్తవ్యం? అతను జబ్బు మనిషేంకాదు. హటాత్తుగా ఎలా చచ్చిపోయాడో అర్థంకాకుండావుంది. దూరం ఆలోచించిచూస్తే చాలాకారణాలవల్ల ఇది ఆత్మహత్యలా కనిపిస్తోంది. అంచేత మనం పోలీసులకి తెలియజేసి చేతులు దులుపుకోవడం మంచిదేమో అని తోస్తోంది. దిక్కులేనివాడుగనక ఆ వైతతంగమంతా వాళ్ళే కానిస్తారు."

"దానికిమాత్రం నే నొప్పుకోనయ్యోయ్. ఇప్పటికే ఈగదికి చాలా చెడ్డపేరు వచ్చేసింది. ఇతను గదిలోనే గుటుక్కు మన్నాడని అప్పుడే ఊరంతా తెలిసిపోయింది. ఇక నా కొంపవైపరూ వాసనచూడరు. పైగా పోలీసుల్నిపిలిచి దేశమంతా దండోరా వేయించమంటా వేవిఁటయ్యా! మరేదైనా ఉపాయం ఆలోచించండి." పాపారావుగారు వాపించారు.

"ఆత్మహత్యే అని స్పష్టంగా తెలుస్తోంది. పోలీసుల్ని పిలవక ఏం చేస్తారు? ఇంతట్లోకీ మీ గది పవిత్రం—"

"ఇల్లు నిదా, నాదా? నీకేం. చెబుతావు! అందుకు మాత్రం నే నొప్పుకోనయ్యా." ఖచ్చితంగా చెప్పేశారు పాపారావుగారు.

"ఐతే ఏం చెయ్యడమో మీరే చెప్పండి. అవతల మాకు ఆఫీసులకి వేళవుతోంది."

పాపారావుగారు రెండు నిముషాలు ఆలోచించారు. నెమ్మదిగా గొంతు సవరించుకున్నారు.

"పాపం, దిక్కుమాలిన హనుమంతరావు ఈ లోకంలోంచి వెళ్ళిపో

యాడు. ఆత్మహత్యే చేసుకున్నాడో, మరేదో చేసుకున్నాడో మనకెందుకు- అతను చనిపోయాడు. పాపం, నిన్నటి దాకా మన మధ్య మసిలిన అతన్ని అలా ఒదిలెయ్యడం ఏం బాగుంటుంది? ఎంత మంచివాడు! పాపం, అతన్ని సాగనంపాల్సిన బాధ్యత మనకి లేదంటారా?"

పాపారావుగారి కంఠంలోని మార్దవం వల్ల చాలా మనస్సులు ఆయన భావాలవెంపు నడిచాయి.

"ఉందండి. అంచాతనే ఏం చెయ్యడం అని!"

"అదే చెబుతున్నాను. మరేంలేదు- ఏమిటంటే...." అంటూ నీళ్ళు నమిలారు పాపారావుగారు.

"ఏంలేదు, మొన్న నే-నూ రెండో అమ్మాయి పెళ్ళయింది. మీకు తెలుసుగా. అందుకు నయాపైసా కూడా ఉన్నది ఖర్చయిపోయింది. అలాగని మరీ అంత డబ్బు సర్దకుండా ఉండననుకోండి. కాని, మీరుకూడా కాస్త కాస్త చందా వేసుకుంటే ఇదేదో లేదనిపించి...." అర్థోక్తిలో ఆగిపోయి అందరి ముఖాల్లోకి చూసిన పాపారావుగారికి ఏ ముఖంలోనూ కళ కనిపించలేదు.

ఒకాయన అభ్యంతరం చెప్పబోయాడు.

"ఇక దయచేసి అభ్యంతరం చెప్పకండి. తలోక రెండు రూపాయలూ వేసుకోండి. మిగతాది నేను సర్దుతాను. ఎంత ఖర్చయినా ఆ పైన నేనే భరిస్తాను." అన్నారు పాపారావుగారు.

ఇలాగ తర్జనభర్జనలు ప్రారంభమయ్యాయి. సమస్యలన్నిటినీ దాటిపోయిన హనుమంతరావు, మిగతా వాళ్ళందరికీ పెద్ద సమస్యగా పరిణమించాడు.

పాపారావుగారు-దహనానికి యథావిధిగా చెయ్యవలసిన క్రమం, దానికయ్యే ఖర్చులు, సాధక బాధకాలూ ఏకరువు పెడుతున్నారు. ఆ ఖర్చంతా ఒక్కడినే భరించమనడం బాగులేదని నచ్చచెబుతున్నారు.

అరగంట తరువాత ఎలాగో అందరూ ఒక కొలిక్కి చేరారు. తలో రెండు రూపాయలూ చందా ఇవ్వడానికి విధిగా సమ్మతించారు.

డబ్బంతా పాపారావుగారే వసూలు చేశారు. పనులు ప్రారంభమయ్యాయి. బాధ్యత నెత్తిమీద పడుతుందేమోనన్న భీతిచేత చాలామంది ఏవో అత్యవసరమైన పనులు కల్పించుకుని వెళ్ళిపోయారు. ఒకరిద్దరు తప్ప డబ్బంటే పారేశారుగాని నడుం కట్టడానికి నామోషీ! బాధ్యతంతా భరించడానికి పాపం పాపారావుగారు తలవంచారు!

శవవాహకులు దొరకలేదని తోపుడు బండిని మాట్లాడారు. కలప ఖరీదు ఎక్కువని — పాతిపెట్టడానికి ఏర్పాటు చేశారు. బండివాళ్ళే శవాన్ని బండెక్కించారు.

హనుమంతరావు అంతిమ యాత్ర నిరాడంబరంగా ప్రారంభమైంది.

ముందు, వెనుక ఇద్దరు మనుష్యులు బండి నెమ్మదిగా కదుపుతున్నారు. ఆ వీధిలో కిటికీల్లోంచీ, గుమ్మాల్లోంచీ, కొందరు చూస్తున్నారు. ఎవ్వరి కళ్ళలోనూ కన్నీళ్ళు లేవు; ఎవ్వరి గుండెల్లోనూ సానుభూతి లేదు.

అప్పులిచ్చిన వాళ్ళు. 'ఇంకొక వారం రోజులు అతను బ్రతుకుతాడని తెలిస్తే బావుండును.' అని అనుకొంటున్నారు. వాళ్ళ పెదవులుమాత్రం 'అయ్యోపాపం' అంటున్నాయి.

బండి, చిన్న కీచుశబ్దంతో నడుస్తోంది. హనుమంతరావు మరణానికి ఆశబ్దమే రోదనధ్వనిలా వుంది. బండిమీద తెల్లబట్టలో యిరుక్కున అతని శరీరం కొద్దిగా అటూ యిటూ కదులుతూంది. బండి వెనుక చాలా తక్కువమంది నడుస్తున్నారు. వాళ్ళెవరూ మాటాడుకోవడం లేదు. ఎవరి ఆలోచనలు వాళ్ళవి. వాళ్ళమధ్యనున్న పాపారావు గారి ఆలోచనలమధ్య—వసూలైన సొమ్ములో ఎంత మిగులుతుంది? అది తన అద్దెబకాయికి సరిపోతుందా లేదా? అని లెఖలు తయారౌతున్నాయి!

వాహనం నడుస్తోంది. హనుమంతరావు ఎలా చనిపోయాడో, ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడో ఎవ్వరికీ తెలియలేదు. అసలు అది ఆత్మహత్యో కాదో తెలియదు. అతను ఎందుకు చనిపోయాడో తెలుసుకోవాలనే ఆసక్తి ఏ ఒక్కరిలోనూ లేదు.

ఎవ్వరికీ చెప్పకుండా వెళ్ళిపోయిన ఎవ్వరూలేని హనుమంతరావు శరీరం అతి నెమ్మదిగా కదులుతోంది.

బండి అవతలి వీధిలోకి మలుపు తిరిగింది. ఆ వీధిలో అతనికెవ్వరూ వీడ్కోలు చెప్పడంలేదు. విచిత్రంగా చూడడమూలేదు.

ఆ వీధిలో ఒక్క తాటాకుయింటి తలుపుమాత్రం తెరచివుంది. ఆ గుమ్మంలో పద్దెనిమిదేళ్ళ అమ్మాయి.

వాహనం నడుస్తోంది. ఆ యింటి ముందునుంచి వస్తోంది. ఆఅమ్మాయి చూపులు బండిమీద వున్నాయి. ఆ అమ్మాయి కళ్ళలోంచి నీళ్ళు ధారగా ప్రవహిస్తున్నాయి!

బండి నెమ్మదిగా మరోమలుపు తిరిగిపోయింది.

పైటచెంగుతో ముఖాన్ని కప్పుకుని ఆ అమ్మాయి రివ్వున లోపలికి వెళ్ళిపోయింది. ఆత్మీయుణ్ణి కోల్పోయినట్టు ఆమె గుండెలు రోదిస్తున్నాయి.

బండిమీద రుద్రభూమికేసి కదులుతున్న హనుమంతరావుకి ఆ అమ్మాయి విషయం తెలియనేలేదు!....

□●□